సాక్షి
వికారాబాద్
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



కాంగ్రెస్‌లో భారీ చేరికలు

బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. 11లో▸



అశ్వ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



ఆలయ కోనేరులో స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

చక్రస్నానం.. సర్వపాప హరణం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం దేవేరుల సమేత మలయప్ప స్వామికి చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తిరుమల నుంచి వచ్చిన అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరాహస్వామి ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. వేలాది మంది భక్తులు శ్రీవారి కోనేరులో స్నానమాచరించారు. గురువారం రాత్రి శ్రీవారు అశ్వ వాహనంపై విహరించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజావరోహణం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 4న ఎగురవేసిన ధ్వజాన్ని శుక్రవారం రాత్రి కిందకు దింపారు. భూదేవి శ్రీదేవి సమేత శ్రీనివాసుడు సీతారామ లక్ష్మణుల అవతారంతో తిరుచ్చి వాహనంపై ఊరేగారు. ఈ వాహనం ముందు విశ్వక్సేనుడు, చక్రతాళ్వార్‌లు దేవాలయ ప్రదక్షిణ చేస్తూ ధ్వజస్తంభం వరకు వచ్చారు. యాగశాల నుంచి పూర్ణకుంభం తెచ్చి శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆవాహణం చేశారు. దీంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ అర్చకులు ప్రకటించారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ రంజిత్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ చేవెళ్ల అభ్యర్థి, ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను ప్రతి ఒక్కరికీ అందేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీపీ తనయుడు శ్రీనివాస్ గుప్తా, పెద్ద ఉమ్మెంతాల్ మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ముక్కంటి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మల్కాపూర్ మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ శ్రీధర్ గుప్తా, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఆనందం, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, అజీం పటేల్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతోనే ముక్తి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: భక్తి భావంతోనే ముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాల పంపిణీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆర్టీసీ ద్వారా తలంబ్రాలను బుక్ చేసుకున్న వారికి ఇంటికే వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, నాగవర్ధన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పూడూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌లో ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ పాల్గొని పూజలు చేశారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు అనిల్, గంగాధర్ గౌడ్, మాజీ సర్పంచ్ రామస్వామి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీదే అధికారం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి



తాండూరులో ప్రచారం చేస్తున్న కొండా సంగీతారెడ్డి

తాండూరు: చేవెళ్ల ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి కోరారు. శుక్రవారం తాండూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ గాలి వీస్తోందన్నారు. మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. రాజకీయంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిబ్బరంతో ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ అంతారం లలిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్.. బీసీ నినాదం

ఎంపీ ఎన్నికల్లో ఇదే వ్యూహం

- బీసీ సంఘాలను అక్కున చేర్చుకునేలా కార్యాచరణ
- చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ప్రధాన అస్త్రంగా..



వికారాబాద్: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ బీసీ వాదానికి తెరతీసింది.అందరికంటే ముందుగా సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని చేవెళ్ల అభ్యర్థిగా ప్రకటించిన అధిష్టానం.. ప్రచారంలో భాగంగా సన్నాహక సమావేశాలు నిర్వహించింది. అయితే అనూహ్య పరిణామాల మధ్య పోటీ నుంచి రంజిత్‌రెడ్డి తప్పుకోవడంతో మరో అభ్యర్థి కోసం వేట మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఆచి తూచి అడుగు లేసింది. పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి పేర్లు తెరపైకి వచ్చినా వారు పోటీకి ససేమిరా అనడంతో చివరకు జిల్లాకు సుపరిచితుడు బీసీ ఉద్యమ నేత, రంగారెడ్డి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్‌ఎస్ అధినేత చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపారు. బీఆర్‌ఎస్ పోటీలోనే ఉండదు.. కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ అని అందరు భావించిన తరుణంలో కాసానిని అభ్యర్థిగా ప్రకటించడంతో పోటీ ట్రయాంగిల్‌గా మారిందనే చర్చ మొదలైంది. కాసానికి జిల్లాతో ఉన్న అనుబంధం, ఆయనకు ఉన్న పరిచయాలు, బీసీ ఉద్యమంలో ఆయన పాత్ర తదితర అంశాలు బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో అదనపు బలంగా మారాయి. అనుకున్న స్థాయిలో బీసీ వాదాన్ని తట్టి లేపగలిగితే ఆయనకు గెలుపు అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తెరపైకి బీసీ వాదం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత బీఆర్‌ఎస్ బీసీ వాదాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పేర్కొన్నట్టుగా బీసీ డిక్లరేషన్ అమలు చేయడంతో పాటు జ్యోతిబా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ముందు ప్రతిష్ఠించాలనే డిమాండ్‌తో కవిత ఉద్యమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనూహ్య పరిణామాల మధ్య బీసీ నాయకుడు అయిన కాసానికి టికెట్ ఇవ్వడంతో ఇక్కడ బీసీ వాదాన్ని మరింత బలంగా వినిపించాలనే నిర్ణయానికి ఆ పార్టీ వచ్చినట్లు సమాచారం. ఇటీవల ఆ పార్టీ పెద్దలు నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ ఇదే విషయం చర్చించినట్లు తెలుస్తోంది.

పునరేకీకరణకు కసరత్తు

గతంలో కాసాని జ్ఞానేశ్వర్, ఆయన కుమారుడు జిల్లా నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించారు. ఈ క్రమంలో అనేక సేవా కార్యక్రమాలతోపాటు బీసీ సంఘాలను ఏకం చేసేందుకు కృషి చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వీరు మిగతా బీసీ కులాలతో పాటు ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల నేతలను సైతం కలుపుకొని వెళ్లారు. ఆ సమయంలో ఓ ఊపు రావటంతో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నేతలు ఆయనతో కలిసి నడిచారు. జిల్లాలో ఎవరు సాయమడిగినా అండగా నిలిచేవారనే పేరుంది. అయితే రెండు పర్యాయాలు టికెట్ ఆశించి చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకోవడం.. రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించకపోవడం తదితర కారణాలతో అనుచరులు చెల్లాచెదురై ఇతర పార్టీల్లో చేరిపోయారు. అయినా ఆయనపై అభిమానం మాత్రం తగ్గలేదని పలువురు అంటున్నారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఇచ్చిన నేపథ్యంలో వారందనీ ఏకం చేసి తనకు మద్దతుగా నిలవాలని కోరనున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఆయా బీసీ సంఘాల ముఖ్య నేతలు, బీసీ ఉద్యమాల్లో పాలు పంచుకున్న వారిని రంగంలోకి దింపి బీసీ వాదాన్ని రగిల్చేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం.

కాసానిని గెలిపించుకుందాం: నాగేష్

కుల్కచర్ల: ముదిరాజ్‌ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సంఘం జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకుందామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకుంద నాగేష్, జిల్లా నాయకుడు మాసయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో సంఘాల నాయకులు, స్థానిక మహిళలతో కలిసి మాట్లాడారు. కాసాని గెలుపుకోసం బీసీలందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. బీసీ బిడ్డకు ఎంపీ టికెట్ వచ్చినందున పార్టీలను పక్కన పెట్టి ఆయన గెలుపుకోసం శ్రమించాలన్నారు. చట్ట సభల్లో ముదిరాజ్ ప్రజల గొంతు వినిపించే నేత ఉండాలని అన్నారు.



కాగ్నా నదిలోని పంప్‌హౌస్

ఆశలన్నీ ‘కాగ్నా’పైనే..

- ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి
- పడిపోతున్న కృష్ణా జలాలు
- మిషన్ భగీరథ నిలిచిపోయే ప్రమాదం
- సీఎం రేవంత్ నియోజకవర్గానికి తప్పని ముప్పు
- అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం
- నేడు తాండూరుకు ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్

తాండూరు: తాగునీటి ముప్పు వేగంగా తరుముకొస్తోంది. భూగర్భ జలాలు పడిపోవడం.. నదుల్లో నీటిమట్టం లేకపోవడం సమస్యగా మారింది. జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు మిషన్ భగీరథ పథకం ద్వారానే తాగునీరు సరఫరా అవుతోంది. కృష్ణా నదిలో నీరు లేకపోవడంతో మిషన్ భగీరథ పథకం ఎప్పుడైనా నిలిచిపోయే అవకాశం ఉంది. దీంతో స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లాలోని తాగునీటి వనరులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల వేళ సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా తాగునీటి సరఫరాపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొడంగల్ ప్రాంతానికి గతంలో తాగునీటిని అందించిన కాగ్నా నది వద్ద గల పంప్ హౌస్‌లను తిరిగి అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ శనివారం తాండూరు పట్టణ శివారులోని కాగ్నా నదిని సందర్శించనున్నారు. ఇక్కడ కొడంగల్ పట్టణానికి తాగునీటి కోసం ఒక పంప్ హౌస్ ఉంది. అయితే నాలుగేళ్లుగా దాన్ని వినియోగించడం లేదు. మిషన్ భగీరథ అధికారులతో కలిసి పంప్‌హౌస్‌ను పరిశీలించి ఈ నెలలో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్లు తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

మతతత్వ పార్టీని ఓడించండి

- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలి
- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- కొంగర కలాన్‌లో నియోజకవర్గ బూత్‌స్థాయి నాయకుల సమావేశం

మహేశ్వరం: మత రాజకీయాలు చేస్తూ.. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిని చిత్తుగా ఓడించాలని.. కాంగ్రెస్‌ను గెలిపించాలని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొంగర కలాన్ సమీపంలోని శ్లోక కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ బూత్ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ గుడి, మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దేశ భవిష్యత్తుకు వచ్చే లోక్‌సభ ఎన్నికలు కీలకం కానున్నాయని.. బీజేపీని ఓడిస్తే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సమగ్రత, సమైక్యతకు విఘాతం కలిగించేలా మతోన్మాదాన్ని పెంచి పోషించిందని ఆరోపించారు. మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, జాతీయ స్థాయిలో ప్రవేశపెట్టిన పాంచ్ న్యాయ్‌లను ప్రజలకు వద్దకు తీసుకెళ్లి చైతన్యవంతులను చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏవిధంగా పని చేసి అధికారంలో తీసుకొచ్చారో అదే స్ఫూర్తితో ఎంపీ ఎన్నికల్లో పనిచేసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూత్ స్థాయి సభ్యుల పనితీరు ఆధారంగా త్వరలో ఇందిరమ్మ కమిటీల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ స్థానాల్లో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎంపీగా పని చేసి సమయంలో చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని పేర్కొన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులను బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు తన గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బూత్ స్థాయి కార్యకర్తలు, ఇన్‌చార్జిలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జిలు నేరేళ్ల శారద, నిజాం, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు సన్నద్ధం

- నేడు చేవెళ్లలో బీఆర్‌ఎస్ బహిరంగ సభ
- హాజరుకానున్న మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు
- భారీగా జనసమీకరణకు కసరత్తు



సభావేదిక ఎదుట ప్రజల కోసం వేస్తున్న కుర్చీలు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల నుంచి ప్రారంభించనున్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపుకోసం శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ మేరకు చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలను తరలించేందుకు సన్నద్ధమయ్యారు. సభను విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికలను కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మెజార్టీ ఎంపీ సీట్లు గెలుచుకుంటే బీఆర్‌ఎస్‌కు తిరుగుండదని నిరూపించాలని చూస్తున్నారు. పార్టీకి పూర్వ వైభవం రావాలంటే ఈ ఎన్నికల్లో గెలుపు తప్పనిసరని భావిస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు భారీగా జనసమీకరణ చేస్తున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.. పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, ఆనంద్‌కు బాధ్యతలు అప్పగించారు.

సభను జయప్రదం చేద్దాం

- మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- పార్టీ నేతలతో కలిసి చేవెళ్లలోని ఫరా కళాశాల గ్రౌండ్ పరిశీలన



సభావేదికను పరిశీలిస్తున్న సబితారెడ్డి, కాలె యాదయ్య, స్వామిగౌడ్ తదితరులు

చేవెళ్ల మండల కేంద్రంలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో శనివారం నిర్వహించే మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేద్దామని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సభా ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, గట్టు రాంచందర్‌రావు, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, డీసీఎంఎస్ కృష్ణా రెడ్డి, రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజలను, రైతులను మోసం చేసి కాంగ్రె స్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అప్పుడే ప్రజల నుంచి వ్యతిరేకత మూటగట్టుకుంటోందన్నారు. చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ఎవరిని పంపించినా గెలిపించిన చరిత్ర ఉందన్నారు. గతంలో విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిని పంపిస్తే గెలిపించారని గుర్తు చేశారు. కానీ వారు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారారని అన్నారు. ఈసారి బీసీ నాయకుడు, ఎంతో రాజకీయ అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను పంపించారని.. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సభకు లక్షమందికిపైగా జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. బీసీ నాయకుడిని గెలిపించుకునేందుకు బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల గడ్డపై మరోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగురుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, ప్రభాకర్, అనంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, యాదగిరి, తోట శేఖర్, నర్సింలు, రంగారెడ్డి, నర్సింలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న మండల సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అనితాగౌడ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. దీనికి ఎంపీటీసీలు, గ్రామ ప్రత్యేకాధికారులు హాజరు కావాలని కోరారు.

తనిఖీల్లో రూ.1.20 లక్షలు పట్టివేత



సీజ్ చేసిన నగదుతో సీఐ సంతోష్‌కుమార్

తాండూరు టౌన్: ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిమితికి మించి నగదును తీసుకెళ్లవద్దని తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఇంద్రాచౌక్ సమీపంలో పోలీసులు సాధారణ తనిఖీలు చేపట్టారు. సాయిపూర్ ప్రాంతానికి చెందిన అంబర్‌పేట్ పవన్‌కుమార్ బైక్‌పై ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.20 లక్షల నగదును తీసుకెళ్తున్నాడు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పోలీసులు నగదును సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి పంపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు.

కాలకృత్యాలకు వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నర్సప్ప మృతదేహం

కొడంగల్: కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని రావులపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి నర్సప్ప(50) శుక్రవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి ఆరుబయటకు వెళ్లాడు. సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా టాటా ఏసీ వాహనం ఆయనని బలంగా ఢీకొట్టింది. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు నర్సప్పను కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుని కుమారుడు అశోక్ ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

బొంరాస్‌పేట: కుటుంబ సభ్యులతో నిద్రించిన వ్యక్తి తెల్లారేసరికి విగతజీవిగా మారాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కొత్తూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దకుర్వ నర్సిములు(40) భార్య సుమలత, కుమారుడు ఆకాశ్‌తో జీవిస్తున్నాడు. నర్సిములుకు రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఇంట్లో ఉంటూ ఇటీవల కోలుకున్నాడు. కాగా గురువారం రాత్రి ఆయన కుటుంబ సభ్యులతో ఇంట్లో తిని పడుకున్నారు. ఉదయాని కల్లా నర్సిములు మృతి చెందాడు. శుక్రవారం కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ రవూఫ్ వచ్చి విచారించారు. శవాన్ని పరిగి ఆస్పత్రికి పోస్టుమార్టం చేయించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య, కొడుకును విచారణలో ఉంచారు.

బీఆర్ఎస్ శ్రేణులకు బీజేపీ గాలం

- వరుసగా కారు దిగుతున్న నాయకులు
- జిల్లా అధి నాయకత్వమే కారణమంటూ ఆరోపణలు
- తాజాగా కాషాయ పార్టీలో చేరిన వడ్ల నందు



ఎంపీ లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరిన వడ్ల నందు

ధారూరు: మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. బీజేపీ అధిష్టానం బీఆర్ఎస్ నాయకులకు గాలం వేసి లాక్కుంటుందని సొంత పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. పార్టీని వీడటానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ వైఖరే కారణమని ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎబ్బనూర్ మాజీ సర్పంచు రాజేందర్‌రెడ్డి, మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, కేరెళ్లి ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ ఎన్నికల తేదీ ప్రకటించిన తర్వాత బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్ ఆయన భార్య మాజీ ఎంపీపీ ఉమాపార్వతి, పలువురు మాజీ సర్పంచులతో బీజేపీలో చేరారు. తాజాగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు వడ్ల నందు రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సమక్షంలో శుక్రవారం కాషాయ పార్టీలో చేరారు. ఈయనతో పాటు పలువురు మాజీ సర్పంచులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. పార్టీని వీడకుండా చూడాల్సిన బీఆర్ఎస్ జిల్లా అధిష్టానం మౌనం వహించిందనే ఆరోపణలున్నాయి.

అయోమయంలో కార్యకర్తలు

కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ధారూరులో పార్టీ సమావేశాలు నిర్వహించి నాయకులను సమన్వయ పరిచి చేజారకుండా చేయాల్సిన బీఆర్ఎస్ నాయకులు అంతగా పట్టించుకోవడం లేదని కార్యకర్తలు ఆరోపించడం గమనార్హం. నియోజకవర్గంలోని ఒక్క ధారూరు మండలం నుంచే బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడటంపై అధిష్టానం సైతం ఆరా తీస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో 32 మంది బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడనున్నట్లు విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ నుంచి వెళుతున్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్, బీజేపీ పార్టీలో చేరడం చర్చనీయాంశమైంది.

ఉద్యమకారులను విస్మరించారు

రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సమక్షంలో తెలంగాణ ఉద్యమకారుడు వడ్ల నందు నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజునాయక్, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు అందెయ్య, మహేశ్‌గౌడ్‌లు సైతం కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వికారాబాద్‌లో విలేకరులతో వడ్ల నందు మాట్లాడారు. రెండుసార్లు వికారాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డానన్నారు. 18 ఏళ్లుగా బీఆర్ఎస్‌లోనే ఉంటూ పార్టీకి సేవలందించానని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ముందు నుంచి ఉన్న వారిని కాదని చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లు కొత్త వారిని తీసుకుని తమను విస్మరించారని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌పై వ్యతిరేకత ఉన్నా పార్టీ పట్టించుకోలేదని ఆరోపించారు. తన సొంత డబ్బును ప్రజా సమస్యల పరిష్కారం కోసం వెచ్చించానన్నారు. ఇంత చేసినా కనీసం నామినేటెడ్ పోస్టు కూడా దక్కలేదని వాపోయారు. ప్రస్తుతం బీఆర్ఎస్ మునిగిపోయే నావ లాంటిదని, ప్రధాని మోదీ నాయకత్వంలో పనిచేయాలని బీజేపీలో చేరానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, చేవెళ్ల ఎంపీ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, నాయకులు రమేశ్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

ధారూరు: తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, వెండి, నగదును అపహరించారు. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధి దోర్నాల్ గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోర్నాల్‌కు చెందిన కుమ్మరి వెంకటయ్య గురువారం పరిగి మండలం నస్కల్ గ్రామంలో ఉన్న తన భార్య వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో వెంకటయ్య ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరచి ఉండటాన్ని వెంకటయ్య సోదరుడు యాదయ్య గమనించాడు. వెంటనే తమ్ముడికి ఫోన్ చేశాడు. అనంతరం వారిద్దరూ ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువా, ట్రంకు పెట్టెను పగల గొట్టి అందులోని రెండు తులాల బంగారం నాను, 3 మాసాల బంగారు వంకు, 18 తులాల వెండి పట్టగొలుసులు, అరతులం, మూడు మసాల రెండు జతల బంగారు కమ్మలు, రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. ఇంటిని పరిశీలించారు. బాధితుడు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికెన్ ధరకు రెక్కలు

వరుస పెళ్లిళ్లు కారణమంటున్న చికెన్ షాపు నిర్వాహకులు



అనంతగిరి: ఓ వైపు తీవ్రమైన ఎండలు దంచి కొడుతున్నాయి. మరోవైపు చికెన్ ధరలు సైతం అదే రీతిలో పెరుగుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో చికెన్ రేట్ తగ్గుతుందని అందరూ అనుకుంటున్నారు. కానీ గత 3–4 ఏళ్లుగా అందుకు విభిన్నంగా చికెన్ రేట్ పెరుగుతుంది. వికారాబాద్‌లో శుక్రవారం చికెన్ ధర స్కిన్‌లెస్ కిలో రూ.280 పలికింది. రెండు రోజుల క్రితం ఏకంగా కిలో రూ.300 కు చేరింది. ఒక్కసారిగా పెళ్లిళ్ల సీజన్ ఉండటంతో కోడి కూర ధర పెరుగుతుందని చికెన్ షాపు నిర్వాహకులు చెబుతున్నారు. శుభకార్యాలకు తప్పనిసరిగా నాన్‌వెజ్ పెడుతుండటంతో డిమాండ్ పెరిగి ధరలు సైతం ఒక్కసారిగా పెరిగాయి. అయినా జనాలు ధరతో సంబంధం లేకుండా చికెన్‌ను ఇష్టపడుతున్నారు. మార్కెట్‌లో మటన్ ధర కిలోకు రూ.750 పైమాటనే ఉంది. దీంతో మధ్య తరగతి ప్రజలు సైతం తమ బడ్జెట్‌లో చికెన్‌కే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వడంతో వినియోగం పెరిగింది. ఇదిలా ఉండగా ఎండలు తీవ్రంగా ఉండటంతో ఫారంలలో కోళ్లు సైతం మృత్యువాత పడటం కూడా ఈ ధరలు పెరగటానికి కారణమని దుకాణదారులు చెబుతున్నారు. మే నెలలో పెళ్లిళ్లు అంతగా లేకపోవడంతో అప్పుడైన చికెన్ ధరలు దిగి వస్తాయా అని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు.

రేపు వీరశైవ లింగాయత్ సమావేశం

కద్లాల్: మండల కేంద్రంలోని శివాలయంలో ఈ నెల 14న నిర్వహించనున్న వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాణం అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంతో పాటు, సంఘం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తామన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

పరిగి: ఎన్నికల కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై సంతోష్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.50 వేలకు మించి ఎక్కువ డబ్బును తరలిస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. నగదుకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకుని సూచించారు. లేకుంటే డబ్బును సీజ్ చేసి ప్రభుత్వానికి అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

కేశంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అని వర్గాలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. డీకే అరుణ కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే విమర్శిస్తుందన్నారు. ఆమె అహంకారానికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో బీజేపీ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రంలో ఎన్ని గృహాలను నిర్మించారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోగా 32 వేల ఉద్యోగాలను కల్పించిదన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కలిసికట్టుగా మహబూబ్‌నగర్ ఎంపీని కాంగ్రెస్ గెలుచుకునే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ కృష్ణయ్య తన అనుచరులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఏపీ మిథున్‌రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల అధ్యక్షుడు వీరేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, నాయకులు జితేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేష్, కరుణాకర్‌రెడ్డి, రమణరెడ్డి, సుందరయ్య, లక్ష్మయ్య, మక్బూల్, రూప్లానాయక్, అమీర్, అఖిల్ పాల్గొన్నారు.

ఫొటో లేదంటూ రగడ

కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో కేశంపేట జెడ్పీటీసీ, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ఫొటో లేకపోవడంతో కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే ఫ్లెక్సీ పైన కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి ఫొటో ముద్రించిన నాయకులు మండలానికి చెందిన జెడ్పీటీసీ ఫొటో ముద్రించకపోవడంతో వర్గపోరు బహిర్గతమైంది. అక్కడికి చేరుకున్న జెడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి నాయకులతో మాట్లాడి, సమావేశంలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. ఇదే విషయం వాట్సాప్ గ్రూపుల్లో చెక్కర్లు కొట్టడంతో జెడ్పీటీసీ ఫొటోను బ్యానర్‌పైన అతికించారు.

చేతులు కలిసినా.. మనసులు కలిసేనా?

- పాత, కొత్త నేతల మధ్య కుదరని సయోధ్య
- కాంగ్రెస్‌లో కనిపించని సమన్వయం
- వలస నేతలతో కలిసిపోని కేడర్
- చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో విచిత్ర పరిస్థితి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్‌కు పెద్ద చిక్కొచ్చి పడింది. అధికారంలోకి రాగానే వలసలను ప్రోత్సహించడం పార్టీని నమ్ముకున్న కేడర్‌ను అసంతృప్తికి గురిచేసింది. కష్టకాలంలో వెన్నంటి నిలిచిన తమను కాదని ప్రత్యర్థి పార్టీల నాయకులను చేర్చుకోవడం వారిని నైరాశ్యంలోకి నెట్టింది. మొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఢీ అంటే ఢీ అని పోరాడిన తమను జంప్ జిలానీలతో కలిసి నడవాలని అధిష్టానం ఆదేశించడం జీర్ణించుకోలేక పోతోంది. పాత, కొత్త నాయకుల మధ్య కొరవడిన సమన్వయం లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గ్రేటర్‌లో ఘోర పరాభవం మూట గట్టుకున్న హస్తం పార్టీ.. ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ఎన్నికల్లోపు బలపడాలని భావించింది. అందుకు తగ్గట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, బడా నేతలపై వల విసిరింది. ఈ దిశగా చేరికల పర్వాన్ని కొనసాగిస్తోంది. ఇదే ఆ పార్టీకి కష్టాలను తెచ్చి పెడుతోంది.

రంజిత్‌పై రుసరుసలు

- చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోనూ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ స్థానం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి వర్గం రంజిత్ ప్రచార కార్యక్రమాలకు దూరం పాటిస్తోంది.
- చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రూపులుగా విడిపోయింది. భీం భరత్, దర్శన్, వసంతం మూడు గ్రూపులుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ గ్రూపులకు తోడు బీఆర్ఎస్ నుంచి వచ్చిన వలస నేతలు.., పాత నేతలతో కలిసిపోవడం లేదు.
- మహేశ్వరంలో బీఆర్ఎస్ నుంచి అనేక మంది ద్వితీయ శ్రేణి నేతలు కాంగ్రెస్‌లో చేరారు. పాత, కొత్త నేతల మధ్య ఇప్పటికీ సమన్వయం కుదరలేదు. మాజీ ఎమ్మెల్యే తీగల, జెడ్పీ చైర్‌పర్సన్ అనిత వర్గంతో కలిసిపోవడానికి సీనియర్లు అంతగా ఆసక్తి చూపడంలేదు.

రాజేంద్రనగర్‌లోనూ అదే సీను

- రాజేంద్రనగర్‌లోనూ రెండు వర్గాల మధ్య అంతర్గత పోరు కొనసాగుతోంది. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నరేందర్‌ను కాదని జ్ఞానేశ్వర్‌కు పెద్దపీట వేయడం పార్టీలో అసంతృప్తికి తావిచ్చింది. కొత్తగా చేరిన నేతలు ఇంకా క్రియాశీలం కాకపోగా.. పాత నేతల మధ్య కొరవడిన ఐక్యత పార్టీని ఇరకాటంలో పడేస్తోంది.
- శేరిలింగంపల్లిలోనూ మూడు గ్రూపులు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన రఘునాథ్‌యాదవ్, పోటీ చేసి ఓటమి పాలైన జగదీశ్వర్‌గౌడ్, జెర్రిపాటి జైపాల్ మధ్య సమన్వయ లేమి లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.
- వికారాబాద్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త మధ్య నెలకొన్న వర్గపోరు ఆ పార్టీకి ఇబ్బందులను సృష్టించే అవకాశం ఉంది. తాండూరులో కొత్తగా పార్టీలో చేరిన వారికి, పాత కాంగ్రెస్‌కు మధ్య అస్సలు పొసగడం లేదు. పరిగిలో నామినేటెడ్ పోస్టులు ఆశించి భంగపడిన నేతలు ఆ పార్టీపై అసంతృప్తితో ఉన్నారు. వీరంతా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తారా? అంటే అనుమానమే.

మల్కాజ్‌గిరిలో తీవ్ర అసమ్మతి

- మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం పరిధిలోని కంటోన్మెంట్‌లోనూ అసమ్మతి రాజుకుంది. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలో దిగిన శ్రీ గణేశ్ అనూహ్యంగా కాంగ్రెస్ గూటికి చేరి టికెట్ దక్కించుకోవడం స్థానిక నేతలకు మింగుడుపడడంలేదు. 2018 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన గద్దర్ తనయ వెన్నెల వర్గం.. తాజా పరిణామాలను జీర్ణించుకోలేకపోతోంది.
- ఎల్బీనగర్‌లో పార్టీ ఇప్పటికే మూడు గ్రూపులుగా విడిపోయింది. మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మధుయాస్కీ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా చెలామణి అవుతున్నారు. ఈ పరిణామాలే ఇటీవల ఎల్‌బీ నగర్ సీటు చేజారడానికి ఓ కారణంగా చెప్పొచ్చు. ఓటమి నేర్పిన పాఠాల నుంచి పార్టీ నాయకులు ఇంకా గుణపాఠం నేర్వకపోవడం గమనార్హం. వీరి పోరు ఇలావుంటే పార్టీలో చేరిన కార్పొరేటర్ సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, నాయకుడు నల్లా రఘుమారెడ్డి వ్యవహారశైలిపై పాత నేతలు పెదవి విరుస్తున్నారు.
- ఉప్పల్‌లోనూ పాత కొత్త నేతల మధ్య వర్గపోరు కొనసాగుతోంది. నిజానికి మల్కాజ్‌గిరి టికెట్‌ను మాజీ మేయర్ బొంతు రాంమోహన్ ఆశించి పార్టీలో చేరారు. తీరా ఆయనకు కాకుండా స్థానికేతరులకు టికెట్ కేటాయించడంతో ఆయన వర్గం స్తబ్దుగా ఉండిపోయింది.
- కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ బీజేపీని వీడి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చేరికను సీనియర్ నేత కొలను హన్మంతరెడ్డి జీర్ణించుకోలేక పోతున్నారు. ఇద్దరు నేతల మధ్య నెలకొన్న అంతర్గత పోరు ఎన్నికల ప్రచారంపై ప్రభావం చూపనుంది.
- మల్కాజ్‌గిరిలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నీ తానై వ్యవహరిస్తున్నప్పటికీ..లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడటంతో ఆయన కేడర్ నిరాశతో ఉంది. కూకట్‌పల్లిలో బండి రమేష్, సత్యం శ్రీరంగంల మధ్య వర్గపోరు కొనసాగుతోంది.
- మేడ్చల్‌లోనూ పాత, కొత్త నేతల మధ్య కొరవడిన సమన్వయం కూడా పార్టీకి నష్టం చేకూర్చనుందనే ప్రచారం జరుగుతోంది. మొన్నటివరకు మాజీ మంత్రి మల్లారెడ్డితో అంటకాగిన నాయకులకు తాజాగా పెద్దపీట వేయడంపై స్థానిక నాయకత్వంలో తీవ్ర అసమ్మతిని రాజేసింది.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



ప్రచారం నిర్వహిస్తున్న సీతారెడ్డి, నాయకులు

ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతో పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆమె శుక్రవారం పూజలు చేసి, పార్టీ నాయకులతో కలిసి ఎన్నిక ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎంపీగా తన భర్తను గెలిపిస్తే మీకు అందుబాటులో ఉండి సేవ చేస్తారన్నారు. గత ఐదేళ్లు ఎంపీగా ఉంటూ ఎప్పుడు ప్రజల కోసం పనిచేశారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో ప్రజలకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీగా ఏళ్ల తరబడి ప్రజల్లో ముద్ర వేసుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శైలజ, సమత, సరిత, నాయకులు మధుసుదన్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, అశోక్, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

15న ఆలయ భూముల వేలంపాట

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ భూముల కౌలుకు వేలంపాట ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఈఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆలయ పరిధిలోని 32 ఎకరాల భూమి వేలం నిర్వహిస్తున్నామని, గ్రామ ప్రజలు హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

తాండూరు రూరల్: బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులతో పాటు పూజారిని జైలుకు పంపిస్తామని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్ కోత్లాపూర్ గ్రామానికి చెందిన ఓ బాలికతో వివాహం చేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని తల్లిదండ్రులకు పోలీసులు సూచించారు. ఇరువురికి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అమ్మాయిని చైల్డ్‌లైన్ వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

బసవేశ్వరుడి సేవలు చిరస్మరణీయం

వీరశైవ లింగాయత్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్



బసవేశ్వరుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

మంచాల: సమాజ మార్పు కోసం ఆనాడే కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ బసవేశ్వరుడని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలోని పోల్కమ్మ చెరువు కట్టపై వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం మండల అధ్యక్షుడు కొత్తూర్ శేఖరప్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహాత్మ బసవేశ్వరుడి విగ్రహ ఆవిష్కరణలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బసవేశ్వరుడు ఆనాటి సమాజంలో అసమానతలు, వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాడన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించి రాజ్య పాలన సాగించిన గొప్ప నాయకుడని కొనియాడారు. లింగ బేధం లేకుండా అందరూ సమానమని, ఆనాడే స్త్రీలకు అవకాశాలు కల్పించారన్నారు. ప్రతి మానవుడు సమాజం, సాటి ప్రజల పట్ల గౌరవంతో ఉండాలని సూచించాడన్నా రు. కార్యక్రమంలో ఆ సంఘం సెంట్రల్ కమిటీ సభ్యుడు శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు ఎం.శ్రావణి, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి విద్యులత, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, నాయకులు అశ్విని, భిక్షపతి, జ్ఞానేశ్వర్, వెంకటేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హరీష్, అనిల్, పెంటప్ప, రాజప్ప, చంద్రశేఖర్, పరమేష్, సతీష్, చంద్రకాంత్, మల్లప్ప పాల్గొన్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

మొయినాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపుపై పోలీసులు దాడి చేశారు. 13.86 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేడిపల్లి రెవెన్యూలో ప్రగతి రోడ్‌లో అదే గ్రామానికి చెందిన కుమ్మరి రాజు కిరాణషాప్ నిర్వహిస్తున్నాడు. అందులో మద్యం విక్రయిస్తున్నట్లు గురువారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో అర్ధరాత్రి దాడిచేసి షాపులో ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.11 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.